దొంగబుద్ధి

పన్యాల రంగనాథరావు

సూరిగాడు మళ్ళీ దొంగతనం చేసి మరోసారి జెయిల్లో పడ్డాడని అందరికీ తెలిసింది.

ఈ రోజుల్లో మన మనస్తత్వం ఏ విధంగా ఉంటున్నదంటే, దొంగతనానికి పాల్పడ్డ ప్రతీ వ్యక్తినీ దొంగగా పరిగణించం. కనీసం అటువంటివాళ్ళది దొంగబుద్ధి అంటేకూడా ఒప్పుకోం.

ఎందుకంటే, అట్లా ఒప్పుకోకపోవడంలో చాలా లాభా లుంటై.

ఇందులో మరొక చిక్కుంది. దొంగబుద్ధిగల ప్రతీవ్యక్తినీ దొంగగానే ముద్రవేసుకుంటూపోతే, మరి మనదేశం పరిపాలించటానిక్కూడా ఒక్కరూ మిగలరు. మనకొక ప్రభుత్వంకూడా ఉండదు.

ఇటువంటి విషయాలలో మన ఆలోచనలు బాగా పనిచేస్తాయి కనకనే. ఏదో ఈ సూరిగాడిలాంటివాళ్లు చేసే పనులే దొంగపను లంటాం.

ఎటొచ్చీ, సూరిగాడి విషయంలో ఒక ప్రత్యేకత వుంది.

వాడు చేసే ప్రతీదొంగపనికీ మాంచి న్యూస్‌వాల్యూ ఉంది. న్యూస్ వాల్యూ ఉండేటట్టు ముందుగా జాగ్రత్తపడి వాడా పనులు చేయకపోవడమే దానిక్కారణం.

సూరిగాణ్ణి 'గజదొంగ' అనటానికి వీలులేదు. గజదొంగ లక్షణం ఏమిటంటే, వాడు కనీసం ఇన్నిసార్లెప్పుడూ జెయిలుకి వెళ్ళడు. సూరిగాడు చేసే పనులన్నీ మూడోరకం, పోతే రెండోరకం దొంగపనులే. చెప్పొచ్చేదేమంటే ఈసారి వాడు ప్లీడరుగారి మనీపర్సు ఏ సందర్భంలోనో కొట్టేశాడు. వాడిదృష్టికి ఇది కేవలం మూడోరకం దొంగతనం మాత్రమే. వాడి కిందులో పదిరూపాయలన్నా కిట్టుబాటు కాలేదు.

సూరిగాడికి ఒకసంత్సరం మాత్రమే శిక్ష పడింది.

'సంవుచ్చరం యేపాటి? కన్నుమూసి తెరుత్తే గిర్రున తిరుగుద్ది. పోన్లే, సంవుచ్చరం మెతక్కూడా లేదు' అన్నాడు సూరిగాడు.

అందరికీవినపడేట్టే వాడీ ముక్కన్నాడు.

'దొంగవెధవ కన్నీ దొంగబుద్ధులే?' అన్నారు. విన్నవాళ్ళు.

ఎవడైతేమట్టుకు _ వారు తెలీ కడుగుతాను - 'దొంగవెధవ' కాకముందు, 'మంచివెధవగా' ఉండాలని ఎక్కడుంది?

అయితే, సూరిగాడు మాత్రం పూర్వాశ్రమంలో - అనగా 'దొంగవెధవ' కాకముందు, 'మంచివెధవ' గానే ఉంటూ ఉండేవాడని అంతా చెపుతారు. అప్పట్లో, ఒకషావుకారుగారి రేషను దుకాణంలో బియ్యమూ ఇత్యాది, తూనిక వేసి ఇస్తూ ఉండేవాడు.

రేషన్లుఖచ్చితంగా పుచ్చుకునే వారంతా ఒకానొక తెగకీ, అంతకన్నా తక్కువ తెగకీ చెందినవారు- వెంకమ్మా, అప్పన్నా, సింహాద్రీ, అయ్యంగారూ, రాముడూ, శ్రీకంఠం, జనమేజయం, వైకుంఠం, అప్పడూ, సుబ్బి, బుల్లోడూ వీరంతాకూడా సూరిగాణ్ణి, 'వెధవ! చాలా మంచివాడు' అనేవారు ఐక్యకంఠాలతోనూ, ఆప్యాయంగానూ.

అసలీ రేషన్లతో పనిలేని పెద్దలు కూడా చాలామంది ఉన్నారు. ప్రజాస్వామ్యంలో అందరికీ స్థానం ఉంటుంది కద? వారికి పాపం సూరిగాడంటే కూడా ఎవరో తెలీదు.

ఇది వారిగురించి కథకాదు గనక, మనకథ కొద్దాం.

అయితే, సూరిగాడు ఈ మంచితనాన్ని షావుకారు కన్నుకప్పి సంపాదించుకున్న విషయం వారికి బొత్తిగా తెలీకపోదు. మంచితనం సంపాదించటానికి మంచిపనులే చేయనక్కర్లేదు. అట్లా చేయడు. సామాన్యంగా వికటిస్తుంది. ఈ కిటుకు, సూరిగాడివంటి వారికి అర్థమైనంత బాగా మనబోటిగాళ్ళకి అర్థంకాదు. నమ్మండి!

ఒకరికి చెడుగా కనిపిస్తూ, చాలా మందికి మంచిగా కనపడేపని వొకటి చేసేవాడు సూరిగాడు. ప్రతీ రేషను కారు మీదా ఒకటో రెండో పిడికళ్ళ బియ్యం, కొసరుగా పోసేస్తూ ఉండేవాడు.

ఈ కరువు రోజుల్లో అంతకన్నా కావలసిం దేమిటి?

అయితే, ఏమాట కామాటే చెప్పాలి. వాడిదృష్టిలోమాత్రం వాడు కేవలం మంచితనం సంపాదిద్దామని ఈ పనిచేయలేదు.

షావుకారుకి మాత్రం, చాటుగా రెండుమూడురెట్లు ఎక్కువధర ఇచ్చేవారికోసం కట్టించుకుందా మనుకున్న సరుకు ఎట్లా ఉండటంలేదో అర్థంకాదు. తనే తూనిక వేసి ఇవ్వాలంటే, వచ్చేడబ్బా దస్కాం ఎవరు చూసుకుంటారు?

డబ్బు విషయంలో మాత్రం పెళ్లాన్ని కూడా నమ్మరాదని షావుకారు అభిప్రాయం_ కన్విక్షన్. 'తూనిక కాస్త తగ్గించి ఇవ్వడంలోనే ఉంది వ్యాపారంలో లౌక్యం' అంటూ షావుకారు, సూరిగాడికి అప్పు డప్పుడు చేస్తూవచ్చిన హితబోధ ఆటే ఫలించలేదు.

*



ఒక్కొక్కప్పుడు చెడ్డబుద్ధిని కప్పి పుచ్చడం సాధ్యం కాకపోవచ్చు.

ఈ నీతి ప్రకారం, సూరిగాడి మంచి బుద్ధి ఎన్నాళ్ళని దాగుతుంది ?

వాడి మంచిదనాన్ని షావుకారే, ఎలా పట్టేశాడని అడక్కండి_పట్టేశాడు.

'దొంగవెధవా! ఎన్నాళ్ళయి ఇట్లాంటి పని చేస్తున్నావు?' అన్నాడు షావుకారు, సూరిగాడిమీద ఎగిరిపడుతూ. 'నేను చేసిం దేటి? తవు రెంత సెప్తే అంతకు తగ్గించి ఇత్తున్నాగానా!' అన్నాడు సూరిగాడు.

"అబద్ధాలు కూడానట్రా, దొంగ బుద్ధికితోడు! నీ అంత మంచివాడు లేడని ఖాతాదార్లంతా అంటూవుంటే, నిజమే కాబోలని నేను పొంగిపోయినాను!" అన్నాడు షావుకారు.

"తూనిక తక్కువవేసి యిమ్మంటూ, నాది దొంగబుద్ధి అంటావేటయ్యోయ్," అన్నాడు సూరిగాడు.

"నోరుముయ్. నీపని పట్టిస్తానుండు, ఇలాక్కాదు !" అంటూ, జారిపోతున్న పంచె కుచ్చెళ్ళు కోపంతో సవరించు కున్నాడు షావుకారు.

అంతేకాదు, వాడిపని పట్టించడంలో, తనపని కూడా కొద్దిగా పట్టించు కున్నాడు.

రేషను నిబంధనల ప్రకారం సూరి గాడికి శిక్ష పడటమే కాకుండా, వాడి 'మంచితనం' మూలంగా షావుకారుకి కించిత్తు జరిమానాకూడా పడింది.

సూరిగాడికి శిక్ష పడ్డప్పుడు మాత్రం 'వా డేమో మంచివాడే! కాని వాడి బుద్ధి దొంగబుద్ధి!' అంటూ ఖాతాదార్లలో కొందరు తీర్మానించారు.

'షావుకారు బియ్యం సాటుగా దాసు

కొన్ని, పెద్దోళ్ళకి సాటుగా అమ్ముకోగల దేం? ముందు ఆడిని కొట్లో తొయ్యాలి' అనుకున్నారు వెంకమ్మా, అప్పుడూ, బుల్లోడూ

'మంచితనానికి రోజులు కావోయ్! పాపం కష్టానికి ఆదుకుంటాడు కదా షావుకారు! మళ్ళీ ఎక్కడన్నా, పెళ్ళన్నా, పండగన్నా, పబ్బమన్నా, అంతా బియ్యంకోసం ఆయన కాళ్ళు పట్టుకునేవాళ్లే. సౌమ్మ త్తగారిదీ, ధార పోసేది అల్లుడూనా. సూరిగాడు బియ్యం దానం చేయడ మేమిటి. ఏ పాపమూ ఎరగని షావుకారికి జరిమానా యేమిటి? ఇదేమన్నా న్యాయమేనా? మీరే చెప్పండి. రేషను రూల్సు మార్చాలి. ఏమం టారు?" అన్నాడు జనమేజయం.

"అవును మరి. రేషను రూల్సు మార్చాల్సిందేనూ?" అన్నారు అయ్యం గారూ, శ్రీకంఠం, వైకుంఠం.

ఏమైతే నేం? నాటినుంచీ మన సూరి గాడు దొంగవెధవై కూర్చున్నాడు.

కూర్చున్నవాడు కూర్చోక, రెండు మూ డేళ్ళలో వాడు, చిల్లర మల్లర దొంగతనాలు చాలా చేశాడని చెపుతారు. కొన్నింటికి శిక్షలు పడ్డాయంటారు; కొన్నింటికి పోలీసులు వాడి దగ్గర రూపాయీ, అర్ధా పుచ్చుకొని వొదిలేసి, వాడి మంచితనాన్ని మెచ్చుకోవడం కూడా కద్దంటారు. అసలు, పోలీసుల లోనే కొందరు, వాడికి అప్పుడప్పుడు సహాయంకూడా చేస్తా రంటారు.

ఇవి ఆనోటా ఆనోటా అనేమాటలు. స్మండీ! ఎవరు చూసొచ్చారు?

ఆ తర్వాత, ప్లీడరుగారి మనీపర్సు కొట్టేసినప్పుడు మాత్రం, ప్లీడరుగారే స్వయంగా, వాడిని కనికరించి, తన పలుకుబడిలో ఒక వీసమెత్తు త్యాగం కూడా చేసి శిక్ష ఒక్క సంవత్సరానికి తగ్గించారు.

సూరిగాడి జీవితచరిత్రలో ఎక్కడో కొన్ని పుటలు నేను నింపుతున్నా ననో, ఏంపాడో, మరి, నాకు జెయిలుకి వెళ్ళి నట్టు తెలిసినా మర్నాడే నాకు కలలో కొచ్చాడు.

వాడి ఆకారం ఏమంత భయంకరంగా లేదు. ఎటొచ్చీ, వాడి కుడిచేతి బొటన వేలుకి కాటోలు కట్టుంది. కట్టుపైన అక్కడక్కడ రక్తపుమరక లున్నాయి.

"ఏమయిందిరా?" అని నేను అడిగి నట్టు జ్ఞాపకం.

"ఏందోలే రాజా! ఇట్టా యేళ్లుతెగడం, మళ్ళీ మొలవడం మాకు పరిపాటే" అని వా డన్నా డనుకుంటాను.

"ఏ మొచ్చావు?" అన్నానల్లే వుంది.

"రాకూడదా యేంటి? ఏందో రాత్తు న్నావు కదా, ఈ ముక్కకూడా రాయి అని సెప్పడాని కొచ్చాను. రెక్కాడితే గాని డొక్కాడదు. ఈ సేటుకాలంలో రెక్కాడినా డొక్కడొక్కే! ఏంటం టావు? అందుకే కాటేస్తేనేగాని నా డొక్కాడదు. యెదవది — యీ సిన్న

సిన్న సిట్టాల్లో నాబ నేంటి? కాటుకొ_ద్తే కాసులు రాలాలి జల జలా! గల గలా! సంవుచ్ఛరం సిచ్ఛ నాకేటి సాలుద్ది?- కన్నుమూసి తెరుత్తే గిర్రన తిరుగుద్ది!"

సూరిగా డనుకున్నట్టే సంవత్సర కాలం గిర్రున తిరిగింది. తిరక్క ఆగు తుందా యేమిటి? పొట్టను చేత పట్టు కొని సూరిగాడు మళ్ళీ బయటపడ్డాడు.

"వెధవా! మళ్ళీ దొంగతనానికి పోక-చూశావ్-ఎక్కడేనా, ఇంత పనికి కుదు రుకో!" అంటూ, వాడు విడుదలయ్యాక, వాడి శ్రేయోభిలాషులలో వొకడు సలహా యిచ్చారు.

"మీ రిత్తే కుదురుకోనా? నా కేం సేదా?" అంటూ ఎదురు సమాధాన మిచ్చాడు సూరిగాడు.

"నా కెందుకీ రొష్టు! ఏదో పాపం. మంచివాడవని చెప్పానుగాని! ఏట్లోపడి చావు," అంటూ శ్రేయోభిలాషి దీవిం చాడు వెళ్ళిపోతూ.

"ఏట్లో పడితే నే నీదేత్తాను. మీవాం టోళ్ళు గోయింద పలికేత్తారు!" అన్నాడు సూరిగాడు.

"దొంగవెధవకి పనెవరిస్తారు?" అన్నాడు శ్రీకంఠం.

"ఇల్లు గుల్ల చేసెయ్యడూ?" అన్నాడు జనమేజయం.

"నే నిద్దునుగానీ... తీరా..." అన్నాడు వైకుంఠం.

సూరిగాడికి, తన శ్రేయోభిలాషు లలో ఒకరిచ్చిన సలహా తాత్కాలికంగా బాగానే ఉందనిపించింది. తన దొంగ

బుద్ధిని అవతల పెట్టి, రెండు మూడు రోజులు దిమ్మతిరిగాడు. ఇదివరకు తను రేషన్లలో రెండేసి మూడేసి పిడికెళ్ళ బియ్యం ఎక్కువ పుచ్చుకున్న అయ్యం గార్నీ, శ్రీకంఠాన్నీ, జనమేజయాన్నీ, వైకుంఠాన్నీ యాచించాడు–తనకేదన్నా పని ఇప్పించమన్నాడు.

"అయ్యా ఇప్పించగల అయ్యల నడుగురా. మా దగ్గరేముందీ?" అన్నాడు అయ్యంగారు.

"మీ రయ్యంగారని అడిగినానుః" అన్నాడు సూరిగాడు.

"నే నిద్దునుగా నీ... తీరా..." అన్నాడు వైకుంఠం.

"నువు మంచిగా ఉంటూ ఉంటూ, దొంగబుద్ధిని తెచ్చిపెట్టుకున్నావు. నిన్ను నమ్మేదెట్లా?" అన్నారు మరికొంత మంది.

"మా కెవురిచ్చినా రేటి?" అన్నారు అప్పడూ, వెంకమ్మా, రాముడూ.

''గోలీలాడ్దాం, రా, సాలా కాల మయింది," అన్నాడు బుల్లోడు, సుబ్బీ.

రాత్రి సుమారు తొమ్మిది గంటలకు దుఖాణం తలుపులు మూసి, షావుకారు లెక్క చూసుకుంటున్న సమయంలో, సూరిగాడు తలుపుతట్టడంతో కె మాక్కు పడింది.

షావుకారు గుండె దడదడలాడింది. యాభై యేళ్ల పైబడ్డా ఆరోగ్యం సరిగా కాపాడుకొస్తూండడం వల్ల, అది అయింతా టపీమని ఆగిపోలేదు. బెదురు తూనే తలుపు తీశాడు. సూరిగాణ్ణి చూడ గానే మటుకు జడుసుకొని వెనక్కు తగ్గాడు.

"నా కీ రాత్రికి కసిన్ని బియ్యం గింజలు పోసి, రేపు నాకు పనిప్పించండి." అన్నాడు సూరిగాడు.

సూటిగా ఒకే ఒక మాట.

షావుకారు, పోయిన ధైర్యమంతా మూటగట్టుకొని, దొంగ రాస్కెలుడాః మళ్ళీ వచ్చావూ? సిగ్గు లేదట్రా బియ్యం అడగటానికి? దాచిపెట్టినట్టడుగుతావూ? ఇక నడూ – అవతలికి...'' అంటూ తలుపు వేయబోయాడు.

"ఇదిగోః మరి మాటిసిరిపారెయ్యకు. నేను మంచోణ్ణిగాను. ఎరుగుదువుగాః దొంగెదవని. నీవు బ్లాకు యాపారం కోసం దాసిన గింజల్లో పిడికెడు పడెయ్యి. నేకుంటే మరి మాట దక్కదుః" అన్నాడు సూరిగాడు.

వాడికళ్ళు యెర్రగా, తాగినకళ్ళలాగా ఉండటం చూసి, షావుకారుకి అమిత భయం వేసింది. కేకలేద్దామన్నా వీలులేని స్థితి కలిగింది.

"నా దగ్గర బ్లాకేమిటి? రేషనాఫీసర్లా అడుగుతున్నావు?" అన్నాడు షావుకారు; ఎండిననాలుక తడిచేసుకుంటూ.

రేలంగి స్టయిలులో షావుకారు 'బోలీసులూః బోలీసులూః' అనే లోపుగా, మరి ఆపే మాట్లాడటానికి

పీలు కలగనివ్వకుండా, సూరిగాడు, షావుకారి పొట్టలో హటాత్తుగా ఒక్క పోటు పొడిచాడు, చేత్తోనే. షావుకారు విరిగిన మానల్లే పడ్డాడు.

సూరిగాడు, గల్లాపెట్టి చంకనెట్టుకొని, వాడికి ఆ రాత్రికి అవసరమైన పిడికెడు బియ్యంతో సహా, మాయమైనాడు.

అయితే, సూరిగాడు ఎన్నాళ్ళిట్లా మాయమైఉంటాడు? రెండు మూడు రోజులలోనే ప్రత్యక్షమయి, అరెస్టయినాడు. ఈసారి అయిదేళ్ళ శిక్షపడింది.

వెనకటికి, సూరిగాడిచేత మనీపర్సు కొట్టివేయబడ్డ ప్లీడరుగా రొచ్చి "శిక్ష తగ్గేటట్టు చూస్తాను. ఏమిస్తావు?" అన్నారు.

"ఎక్కువ సేయించడం శాతవునా? తగ్గిత్తే నా కేటి వొరుగుద్ది? శాతనైతే ఎక్కించు!" అన్నాడు సూరిగాడు.

ఇటువంటి సమాధానానికి సిద్ధంగా లేని ప్లీడరు కాస్త తబ్బిబ్బు పడ్డాడు.

"పోన్లే. అయిదేళ్ళదాకా నేను మంచోణ్ణే. ఆ పైన సూద్దాం!" అన్నాడు సూరిగాడు.